క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



మద్దూరు: పట్టణంలో పాతబస్టాండ్ దగ్గర బాల హనుమాన్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 35 అడుగుల గణేష్ ఉత్సవాలకు హాజరుకావాలని సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం యూత్ సభ్యులు సాయిలు, విజయ్, భరత్, సూర్యకిరణ్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అలాగే మండపంలో ఏర్పాటు చేయబోయే గణేష్ విగ్రహ చిత్రపటాన్ని అందజేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

14న టెంకాయల వేలం

కోస్గి రూరల్: మండల పరిధిలోని ముంగిమళ్ల గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14న పంచాయతీ కార్యాలయంలో టెంకాయల వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో గెలుపొందిన వారు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు టెంకాయలను విక్రయించుకోవచ్చన్నారు. జాతర ఉత్సవాల్లో ప్రతి రోజు రుద్రాభిషేకం, కుంకుమార్చనతో పాటు అభిషేకాలు ఉంటాయని తెలిపారు.

కల్యాణలక్ష్మి దరఖాస్తుల పరిశీలన

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన 14 మంది కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకం లబ్ధిదారుల సమాచారం అందించగా 10 మంది హాజరు కావడంతో వారి పత్రాలను, లబ్ధిదారులను స్వయంగా పరిశీలించారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భీమమ్మ , జూనియర్ అసిస్టెంట్ జరీనా తదితరులు ఉన్నారు.

టీఎల్ఎం మేళాను విజయవంతం చేయండి


మాగనూర్: మండల స్థాయిలో నిర్వహించే టీఎల్ఎం మేళాను విజయంతం చేయాలని మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం స్థానిక శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ప్రాంగణంలో మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో మండలంలోని ప్రతి పాఠశాల నుంచి విధిగా అంశాల వారీగా మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మేళాలలో ప్రదర్శించే అంశాలపై విద్యార్థులకు అవగహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలలో రాణించాలి



కొత్తపల్లి: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి ఆంజనేయులు సూచించారు. మండల పరిధిలోని నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన క్రీడా సామగ్రిని మంగళవారం ప్రదర్శించారు. ప్రభుత్వం క్రీడా నిధిలో భాగంగా మంజూరు చేసిన రూ.25వేల విలువైన క్రిడా సామగ్రిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్, వేణుగోపాల్, వెంకట్‌రాములు, భీంసేన్, శ్రీనివాస్, ఆనందం, పీడీ కతలప్ప పాల్గొన్నారు.

మట్టితో పూడుకుపోయిన భీమా కాల్వ



మక్తల్: మండలంలోని బీమా కాల్వ భారీ వర్షానికి కొట్టుకువచ్చిన మట్టితో పూడుకుపోయింది. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో కాల్వ కోతకు గురైంది. ఇదే కాల్వ నుంచి సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లకు నీరు వెళ్తుంది. అయితే కాల్వ మొత్తం మట్టితో నిండిపోతే నీరందే పరిస్థితి ఉండదని, అధికారులు స్పందించి పూడిక తీసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

దేశ ఐక్యత కోసమే ‘సద్భావన యాత్ర’



రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర జ్యోతిని అందుకుంటున్న ప్రశాంత్‌కుమార్ రెడ్డి

మక్తల్: రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర పట్ల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని, దేశ ఐక్యత కోసమే కాంగ్రెస్ రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతి యాత్ర చేపట్టినట్లు మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం కర్ణాటక నుంచి బయలుదేరిన రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర జిల్లాలో ప్రవేశించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులతో కలిసి జ్యోతి అందుకొని మాట్లాడారు. బెంగుళూర్ నుంచి న్యూఢిల్లీ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ యాత్ర జాతీయ అధ్యక్షుడు దోరై, జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు సుజేంద్రశెట్టి, రాష్ట్ర స్పోర్ట్స్ ఎండీ సోనీ బాలదేవి, డైరెక్టర్ రవీందర్‌రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, మాజీ జెట్పీటీసీ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగారం గేట్ దగ్గర ఘనస్వాగతం

నారాయణపేట/కృష్ణా: సమాజంలో మత సామరస్యం, అభివృద్ధి పట్ల అవగాహన పెంచుతూ దేశ ఐక్యత కోసం పాటు పడదామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర నారాయణపేట జిల్లాలో ప్రవేశించించగా సింగారం గేట్ దగ్గర ఘన స్వాగతం పలికారు. దేశ ప్రజల్లో ఐక్యత సౌభ్రాతృత్వం పెంపొందించడం యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. దేశ ఐక్యత శాంతి సద్భావన కోసం రాజీవ్ గాంధీ చూపిన మార్గాన్ని ప్రజలకు తెలియ చేస్తు, యువతలో సామాజిక దేశభక్తి విలువలను, నాటేందుకు ఈ యాత్ర ద్వారా చైతన్యం తీసుకు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాత్ర జాతీయ అధ్యక్షుడు ఆర్.దొరై, కన్వీనర్ సుజేంద్ర శెట్టి, అధ్యక్షుడు శ్రీనివాసయ్య పాల్గొన్నారు.

మునిగిన పంటలు.. రైతన్నకు కన్నీళ్లు



నీట మునిగిన వరి పంట

మాగనూర్: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు దెబ్బతింటున్నాయి. వరుణుడి ప్రతాపానికి మండలంలో సాగుచేసిన అనేక పంటలు నీటమునిగాయి. వాగులు, వంకల సమీపంలో ఉన్న పంటలు మూడు రోజులుగా నీటిలోనే మునిగిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటలు నీట మునిగి పూత, కాయలు రాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా వందల ఎకరాల్లో వరి సాగు చేయగా భారీ వర్షానికి పంట నీట మునగడంతో అన్నదాతలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. అధికారులు పంటపొలాలను పరిశీలించి దెబ్బతిన్న వాటికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేసి అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ ఆంజనేయులు

నారాయణ పేట క్రైమ్/నారాయణపేట రూరల్: ప్రతి వాహనానికి నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉంచుకోవాలని ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. మండలంలోని సింగారం చౌరస్తాలో పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని, రహదారి భద్రతా నియమాలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నరసింహ, సుధాకర్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

మాగనూర్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. మాగనూర్ ప్రధాన రహదారిపై మంగళవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించి వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి సర్టిఫికెట్లను తప్పకుండా తమ దగ్గర ఉంచుకోవాలన్నారు. అలాగే వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ,ట్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ మన్నన్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

నారాయణపేట రూరల్: వినాయకుడికి ఎంతో ప్రీతిపాత్రమైన ఉత్సవంగా నిర్వహించే సంకటహర చతుర్థి మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సింగార్ బేస్ శ్రీ శివలింగేశ్వర దేవాలయంలోని గణనాథుని మూలవిరాట్‌కు భక్తులు ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే పంచామృతాభిషేకం, అర్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. మహిళలు ప్రత్యేకంగా కఠినమైన ఉపవాసాన్ని అనుసరించి స్వామివారి పూజానంతరం భోజనాలు చేశారు. అనంతరం అర్చకులు సంకటహర చతుర్థి విశిష్టతను వివరించారు.

‘మాదాసి, మదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వొద్దు’



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట: మాదాసి కురువ, మదారి కురువ కులస్తులకు ఎస్సీ సర్టిఫికేట్ జారీ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ అధ్యక్షుడు బాలరాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అడిషనల్ రెవెన్యూ కలెక్టర్ శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మాదాసి కురువ, మదారి కురువ కులస్తులు ఎవరు లేరని కమిటీ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చిందన్నారు. విచారణ కమిటీ రిపోర్టు ప్రకారం మాదాసి కురువ మదారి కురువలకు సర్టిఫికెట్ల జారీని నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రామస్వామి, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, కమల్, సీమ రాఘవేంద్ర, నర్సిములు, గూప చెన్నయ్య, కుర్మయ్య, వెంకటేష్,అంజి, రాజు, మాసన్న తదితరులు ఉన్నారు.

చెరువులకు జలకళ



నారాయణపేట రూరల్: మండలంలోని పలు చెరువులకు జలకళ సంతరించుకుంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండుతున్నాయి. ముఖ్యంగా కోటకొండ పెద్ద చెరువు నిండు కుండను తలపిస్తుంది. అదేవిధంగా శ్యాసన్ పల్లి శివారులోని చిన్నోని చెరువు, బండగొండ గ్రామ శివారులోని పోలోనీ కుంట చెరువు అలుగు పారుతుంది. ప్రవాహం ఇలాగే కొనసాగితే పై గ్రామాల పరిసరాల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశముందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రసత్యంకు నివాళులు

దామరగిద్ద/ఊట్కూరు/మరికల్/ధన్వాడ: ముదిరాజుల అభ్యున్నతికి దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం చేసిన సేవలు చిరస్మరణీయమని ముదిరాజ్ నాయకులు అన్నారు. మంగళవారం ఎర్రసత్యం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

బహుమతుల పంపిణీ

నారాయణపేట రూరల్: ప్రపంచ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం టౌన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యువత డ్రగ్స్ నియంత్రణకు కృషి చేయాలని, దేశభక్తి దైవభక్తిని అలవాటు చేసుకోవాలని సూచించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం

ఊట్కూర్: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు మద్దతు తెలుపాలని కోరుతూ మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు ఊట్కూర్‌కు చెందిన బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ భాస్కర్ వినతిపత్రం అందించారు. భూ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.14 లక్షలు నష్టపరిహారం అందిస్తుందని, ఎకరాకు రూ.30 లక్షల నష్టపరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇచ్చే విధంగా పాటుపడాలని కోరినట్లు ఆయన తెలిపారు.

కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు



మక్తల్: ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి పట్టణంలోని బసవేశ్వర కాలనీ, మణికంఠకాలనీ, వెంకటేశ్వర కాలనీల్లో , అయ్యప్పకాలనీల్లో డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్ల మధ్య నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కాలనీల్లో కరెంటు స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో రాత్రి సమయంలో రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నామని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ బాలాజీ ఆదేశించారు. మంగళవారం మండలంలోని జాజాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని, మెనూ పాటించాలని వంటలో మంచి కూరగాయాలు, ఆకు కూరలు వాడాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల ఎఫ్ ఆర్ ఎస్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్ఓ భాను ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు పద్మ, ఎమ్మార్సీ సిబ్బంది నారాయణ, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో హెల్త్ క్యాంప్


కొత్తపల్లి: మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలకు టీబీ, షుగర్, రక్త పరీక్షలతో పాటు ఎక్స్‌రేలు తీసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పీఎంఎస్‌పీటీ డాక్టర్, సత్యప్రకాష్ రెడ్డి, జోనల్ వన్ సూపర్ వైజర్ ఎస్తర్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు



నర్వ: మండలంలో యూరియా కోసం రైతులు పీఏసీఎస్ వద్ద అవస్థలు పడ్డారు. మంగళవారం ప్రాథమిక సహకార కేంద్రానికి యూరియా లోడ్ వస్తుందని తెలిసి రైతులు వర్షాన్ని లెక్కచేయకుండా తెల్లవారుజాము నుంచే కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. మధ్యాహ్నం వరకు లైన్ తగ్గక పోవడంతో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ అఖిలారెడ్డిలు రైతులతో మాట్లాడారు. బుధవారం నుంచి నిత్యం రెండు లారీలు యూరియా వస్తుందని, దీంతో పాటు మన గ్రోమర్, ఆగ్రో కేంద్రాలలో రైతులకు సరిపడినంతా యూరియాను అందుబాటులో ఉంచుతామని ఇతరుల మాటలు నమ్మి ఇబ్బందులు పడొద్దన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



ఊట్కూరు: పట్టణానికి చెందిన అబ్దుల్‌ఖాదర్ (63) ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఈ నెల 1న ఊట్కూరు చౌరస్తా వద్ద వస్తుండగా ఆవు ఢీకొట్టింది. దీంతో ఖాదర్‌కు తీవ్ర గాయాలు కావడంతో నారాయణపేటలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక వీధుల్లో తిరుగుతూ జీవనం గడిపేవాడని ఆవు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు తెలిపారు.

నేడు అవగాహన సదస్సు

నారాయణపేట: భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్‌లో వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్ల సత్య సాయి సేవా సమితి జిల్లా కన్వీనర్ చిట్టెం మాధవ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా శౌర్య చక్ర గ్రహీత కలనల్ వెంబు శంకర్, ప్రొఫెషనల్ ట్రైనర్ మోటివేటర్ మల్లేష్, బాలీవుడ్ సింగర్ శ్రీ సాయిరాం అయ్యర్, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ , జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ విచ్చేస్తారని, యువకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

● పరిహారం.. ఫలహారం!

కదిలిస్తే కన్నీరే..



వీరందరూ వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో ముంపు గ్రామమైన బండరాయిపాకులకు చెందిన సామాన్య, మధ్య తరగతికి చెందిన ప్రజలు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన ఏదుల ప్రాజెక్ట్ నిర్మాణంలో వ్యవసాయ భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు. ప్రభుత్వం ఇచ్చిన అరకొర పరిహారాన్ని ఓం శ్రీ సాయిరాం ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులు గద్దలా తన్నుకుపోవడంతో గుండెలు బాదుకుంటున్నారు. నెలనెలా వడ్డీ వస్తుందనే ఆశ నిండా ముంచడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తాము చెల్లించిన డబ్బులను ఇవ్వాలని ఐదేళ్లుగా ఆందోళన చేస్తున్నా.. ఫలితం లేకపోవడంతో వారిలో ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి.

..ఇలా మోసపోయింది ఈ ఒక్క గ్రామస్తులే కాదు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో దాదాపు 50 గ్రామాలకు చెందిన పీఆర్‌ఎల్ఐ నిర్వాసితులు 2,500 మంది ఉన్నట్లు అంచనా. డబ్బులు వస్తలేవనే మనోవేదనతో ఇప్పటికే పలువురు బలవన్మరణాలకు పాల్పడగా.. కొందరు గుండెనొప్పితో తనువు చాలించారు. ఈ నేపథ్యంలో బాధిత నిర్వాసితులను ‘సాక్షి’ పలకరించగా.. కన్నీళ్లే మిగిలాయి. అనారోగ్య కారణాలతో మంచమెక్కిన వారు.. వైద్య చికిత్సలకు డబ్బులు లేక విలవిల్లాడుతున్నారు. ఇళ్లు కట్టుకోలేక, సంతానాన్ని పోషించలేక, చదివించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. బాధితులు ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ కాగా.. వారి ఆవేదన వారి మాటల్లోనే..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

- ఫైనాన్స్ మోసంతో పీఆర్ఎల్ఐ నిర్వాసితుల విలవిల
- ఇప్పటికే కొందరి బలవన్మరణం.. గుండెనొప్పితో తనువు చాలించిన మరికొందరు..
- వైద్య చికిత్సలకు డబ్బుల్లేక మంచానికే పరిమితమైన ఇంకొందరు..
- ఇళ్లు కట్టుకోలేక..పిల్లలను చదివించలేని దుస్థితిలో పలువురు..
- ఆలనాపాలన కరువై ఆదుకునే వారి కోసం వృద్ధుల ఎదురుచూపులు..

నాన్న దూరమయ్యాడు.. కుటుంబం రోడ్డున పడింది..



మా నాన్న రాంచంద్రయ్య ఓం శ్రీ సాయిరాం చిట్‌ఫండ్‌లో రూ.13 లక్షలు పెట్టాడు. ఆ తర్వాత ఆయనకు ఆరోగ్యం బాగాలేకపోతే ఆస్పత్రికి తీసుకెళ్లాం. ఫైనాన్సోళ్లను ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోయేసరికి మనోవేదనతో మంచానపడ్డాడు. దీంతో వైద్య ఖర్చులకు ఆయనపై ఉన్న ప్లాటు అమ్మాల్సి వచ్చింది. ఈ క్రమంలో మా నాన్న గుండెపోటు వచ్చి మరణించాడు. ఇప్పుడు మాకు ఇల్లులేదు. డబ్బుల కోసం నా భార్యకు నాకు గొడవ జరిగింది. వీళ్లతో డబ్బులు పెట్టడం వల్ల మా నాన్న నాకు దూరమయ్యాడు. నా కుటుంబం రోడ్డున పడింది. ప్రస్తుతం ఉండేందుకు ఇంటి స్థలం కూడా లేదు.

– కుర్మయ్య, బాధితుడు

క్యాన్సర్ పేషంట్‌ను.. గోలీలకూ డబ్బుల్లేవు..



పాత బండరాయిపాకులలో మాకు ఐదెకరాల భూమి ఉండేది. పాలమూరు ప్రాజెక్ట్‌తో ఉన్నది పోయింది. ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చాక సాయిరాం ఫైనాన్స్ వాళ్లు నా కొడుకును కలిసిండ్రు. మిత్తి ఎక్కువగా వస్తుందని మాయమాటలు చెప్పి బాగా నమ్మించిండ్రు. దీంతో నా కొడుకు రాములు పేరిట రూ.10 లక్షలు, నా కోడలు గోపాల శివశీల పేరిట రూ.5 లక్షలు, నేను దాచుకున్న రూ.1.50 లక్షలు.. మొత్తం రూ.16.50 లక్షలను 2021లో ఫైనాన్స్ కంపెనీలో డిపాజిట్ చేశాం. ఒకసారి రూ.60 వేలు, మరోసారి రూ.30 వేలు వడ్డీ కింద ఇచ్చారు. ఆ తర్వాత ఆరోగ్యం బాలేదని డబ్బులు అడిగితే ఇవ్వడం లేదు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్తే క్యాన్సర్ వచ్చిందని చెప్పారు. మళ్లీ ఆస్పత్రికి వెళ్లేందుకు, గోలీలకు డబ్బుల్లేవ్. ఫికరుతో ఎప్పుడు సచ్చిపోతనో నాకే తెలుస్తలేదు.

– గోపాల బొజ్జమ్మ, బండరాయిపాకుల, రేవల్లి, వనపర్తి

అతికష్టం మీద బతుకుతున్నాం..



నా పేరు, నా భర్త మీద రూ.6 లక్షలను 2021లో ఓం శ్రీసాయిరాం ఫైనాన్స్ కంపెనీలో పెట్టాం. మాకు నలుగురు కొడుకులు ఉండగా.. ముగ్గురు మరణించారు. ఒక్క కొడుకు మాత్రమే ఉన్నాడు. మాతో డబ్బులు లేకపోయేసరికి మమ్మల్ని ఎవరూ చూసుకోవడం లేదు. ఉన్న కొడుకు కూడా విడిగా ఉంటున్నాడు. నాకు పక్షవాతం వచ్చింది. ఒక కన్ను సరిగా కనిపించడం లేదు. అతికష్టం మీద బతుకుతున్నాం. డబ్బులు అనవసరంగా ఎవరికో ఇచ్చి ఇలా చేశారని కొడుకు, కోడలు నిత్యం తిడుతూనే ఉన్నారు. మాకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలి.

– మిద్దె నాగమ్మ, బాధితురాలు

కిరాయి ఇంట్లో ఉంటున్నాం..



తెలిసిన వాళ్లు మిత్తి వస్తుందని చెబితే.. మాకు పునరావాసం కోసం వచ్చిన డబ్బులు మొత్తం రూ.24 లక్షలను ఓం శ్రీ సాయిరాం చిట్‌ఫండ్‌లో నాలుగేళ్ల క్రితం పెట్టాం. ఇప్పటివరకు మాకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. డబ్బులు లేక మేము ఇల్లు కట్టుకోలేదు. కిరాయికి వేరొకరి ఇంట్లో ఉంటున్నాం. నేనూ మా ఆయన ఇద్దరం కూలీ చేసుకుని బతుకుతున్నాం. మా పరిస్థితి ఇలా ఉంటే.. దుద్దు మల్లయ్య అనే వాళ్లతో రూ.2.60 లక్షలు కట్టించాను. ఇప్పుడు వాళ్లు డబ్బులు ఇవ్వాలని నన్ను టార్చర్ పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

– గోపాల పార్వతమ్మ, బాధితురాలు

ఎవరైనా పెడితేనే తింటున్న..



నేను పని చేయలేను కాబట్టి నెలనెలా మిత్తి వస్తే ఖర్చులకు సరిపోతాయి.. బతకొచ్చు అనుకుని వచ్చిన డబ్బులను నా పేరు మీద రూ.5 లక్షలు ఫైనాన్స్‌లో పెట్టాను. నా కూతుళ్ల లక్ష్మీ రూ.5 లక్షలు, రుక్కమ్మ రూ.6 లక్షలు.. మొత్తం రూ.16 లక్షలు పెట్టాం. మొదట్లో మిత్తి డబ్బులు 2 నెలలు ఇచ్చాడు. ఆ తర్వాత మిత్తి లేదు.. అసలు లేదు నాకు ప్రస్తుతం అన్నం కూడా సరిగా పెట్టడం లేదు. ఎవరైనా బయట పెడితే తింటున్న.. గుడిసెలో వెళ్లి పడుకుంటున్నా.

– భగవంతు, బాధితుడు

డబ్బుల్లేక మందులు తెచ్చుకోలేకపోతున్నాం..



నా భార్య పేరు మీద రూ.11 లక్షలు, నా పేరు మీద రూ.2 లక్షలు.. మొత్తం రూ.13 లక్షలు ఫైనాన్స్‌లో పెట్టాం. మాకు నలుగురు కూతుళ్లు. అందరి పెళ్లిళ్లు అయ్యాయి. ప్రస్తుతం మమ్మల్ని ఎవరూ చూడనీకే రావడం లేదు. నా భార్యకు చేయి విరిగింది. డబ్బుల్లేక మందులు తెచ్చుకోలేకపోతున్నాం. మా డబ్బులు మాకివ్వమని ఎవర్ని అడగాలో తెలియడం లేదు. మా మీద కనికరం చూపించి డబ్బులు ఇప్పించాలి.

– బింగి లింగయ్య, పోపమ్మ దంపతులు

ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటు

మరికల్: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టు డాక్టర్ సంధ్యారాణి వైకల్యం కలిగిన పిల్లలతో ఫిజియోథెరిపి చేయించారు. అనంతరం ఎంఈఓ మిరిజ కలిముల్ల మాట్లాడుతూ మరికల్‌కు భవిత కేంద్రం కూడా మంజూరు అయిందని త్వరలోనే స్థల పరిశీలన చేసి నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ హరిప్రసాద్ పాల్గొన్నారు.